# కారు జోరు.. ప్రతిపక్షాల బేజారు

- బీఆర్ఎస్‌లోకి జోరుగా చేరికలు
- కేసీఆర్ పోటీతో పెరిగిన వలసలు
- కారెక్కుతోన్న బీజేపీ, కాంగ్రెస్ నేతలు
- కామారెడ్డిలో ప్రతిపక్షాలకు ఎదురు దెబ్బ
- బీఆర్ఎస్ పార్టీకే జై కొడుతోన్న సామాన్య జనం
- ఎన్నికల వేళ తమ వారిని కాపాడుకోలేక తంటాలు



ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బట్టుతండా, అన్నారం గ్రామస్తులు

నిజామాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి వలసలు భారీగా పెరుగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన శ్రేణులు పెద్ద ఎత్తున గులాబీ కండువాను ధరిస్తున్నారు. జాతీయ పార్టీల తీరు నచ్చక స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో కారు ఎక్కుతున్నారు. కేసీఆర్ విధానాలను మెచ్చి కామారెడ్డి నియోజకవర్గంలో గులాబీ దళపతికి అండగా నిలిచేందుకు వస్తున్నట్లు వారంతా వెల్లడిస్తున్నారు. కేసీఆర్ పోటీ చేస్తుండడంతో పోరు ఏకపక్షంగానే ఉండడంతో జనంలో బీఆర్ఎస్ హవా కొనసాగుతున్నది. ఎన్నికల రణరంగంలో బీఆర్ఎస్ విజయం ఖాయమైనప్పటికీ భారీ మెజార్టీ కోసమే గులాబీ పార్టీ కృషి చేస్తున్నది. కేసీఆర్ అమలు చేసిన, చేస్తున్న అనేక పథకాలను ఇంటింటికీ చేర్చడంతో పాటు జనాకర్షక పథకాలతో జరుగుతున్న సంక్షేమాభివృద్ధిపై సామాన్యులు చర్చిస్తున్నారు. ఇందులో భాగంగానే గులాబీ పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం అవుతున్నది. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ నుంచి చేరికల పర్వం పెరుగుతుండడంతో గులాబీ పార్టీలో జోష్ కనిపిస్తుండగా ఇతర పార్టీల్లో నైరాశ్యం అలుముకున్నది.

**కామారెడ్డిలో చేరికల జోరు...**

బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు పెరుగుతుండడంతో కమలం పార్టీలో కల్లోలం మొదలైంది. జారవిడుతున్న నేతలను కాపాడుకోలేక కాషాయ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో బీజేపీలో అంతర్గత కుమ్ములాటలతో పాటు తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా చాలా మంది బీజేపీని వీడుతున్నారు. నిత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని అబద్ధాలు, అసంబద్ధ వ్యాఖ్యలతో నిందించడం మినహా కేంద్రం ద్వారా మేలు చేసే ఏ ఒక్క కార్యక్రమం చేపట్టకపోవడంతో బీజేపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల్లో ఒకింత అసహనానికి గురి చేస్తున్నది. ప్రజల ఓట్లతో గెలిచిన వారంతా తిరిగి ప్రజలకు మేలు చేయాలంటే భారత రాష్ట్ర సమితి ఒక్కటే మార్గమని భావిస్తున్నారు. గులాబీ కండువాను కప్పుకుని ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసేందుకు కారెక్కుతున్నారు. ప్రధాని మోదీ తీరు, బీజేపీ అవలంబిస్తున్న విధానాలు నచ్చక యువత సైతం కాషాయ పార్టీని వీడి కారెక్కుతుండడం విశేషం. వలసల జోరు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అంతటా కనిపిస్తున్నది. కామారెడ్డిలో ఈ మధ్య కాలంలో చాలామంది చేరుతుండగా మరి కొంత మంది చేరికకు సిద్ధం అయ్యారు. ఇకపోతే నిజామాబాద్ అర్బన్, రూరల్, బాల్కొండ, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రత్యేకంగా చేరికల పర్వం ఉధృతంగా సాగుతున్నది. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ నేతృత్వంలో చాలా మంది గులాబీ గూటికి వచ్చి చేరుతున్నారు.

**కాంగ్రెస్ నుంచి బయటికి...**

తెలంగాణ రాష్ట్ర సమితిగా ఆవిర్భవించి భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందిన తర్వాత గులాబీ అధినేత కేసీఆర్ జాతీయ రాజకీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగానే రాజకీయ కార్యక్రమాలను సైతం చేపడుతున్నారు. పక్క రాష్ట్ర ప్రజల నుంచి వస్తున్న విన్నపాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ సైతం మహారాష్ట్రలో పార్టీని విస్తరించే పనిలో నిమగ్నమై ఇప్పటికే సక్సెస్ అయ్యారు. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే ధ్యేయంగా కేసీఆర్ దూసుకుపోతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మేటిగా నిలిపిన బీఆర్ఎస్ పార్టీ కృషిని మెచ్చిన వారంతా మద్దతు తెలుపుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, షబ్బీర్ అలీ నాయకత్వానికి చాలా మంది గుడ్ బై చెబుతున్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో పాటు వివిధ విభాగాలకు చెందిన వారంతా హస్తం వదిలి కారు ఎక్కేందుకే ఎక్కువగా దృష్టి సారించారు. ఈ పరిణామాలతో ఏమీ చేయలేక తల పట్టుకునే దుస్థితి కాంగ్రెస్ అగ్రనాయకులకు ఎదురవుతున్నది. ఉద్యమ కాలం నాటి నుంచి నేటి వరకు ఉభయ జిల్లా ప్రజలంతా కేసీఆర్‌కే మద్దతు పలుకుతున్నారు. జాతీయ పార్టీలకు కనీసం డిపాజిట్ దక్కకుండా ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కే ప్రజలంతా పట్టం కడుతున్నారు. వరుసగా ఏ ఎన్నికలొచ్చినా ఏకపక్ష విజయాలను అందిస్తున్నారు. సమైక్య పాలనలో అడుగడుగునా తీవ్రమైన నిర్లక్ష్యానికి, వివక్షకు గురైన తెలంగాణను సీఎం కేసీఆర్ తనదైన శైలిలో పరిపాలిస్తున్నారు. తొమ్మిదిన్నరేండ్ల కాలంలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలబెట్టి దేశంలోనే తెలంగాణకు ప్రత్యేకత గుర్తింపును తీసుకు వచ్చారు.

## నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు



ఈవీఎంల తరలింపు ప్రక్రియను పూర్తి చేస్తున్న సిబ్బంది

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 21 : సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డిల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు ప్రక్రియ నిర్వహించారు. రాండమైజేషన్ జాబితాను అనుసరిస్తూ కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అప్పగించారు. పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనాల్లో వాటిని నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఈసీ సూచనలకు అనుగుణంగా ఈవీఎంలను తరలించారు. ఈ ప్రక్రియలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్న ఈవీఎంల తరలింపు ప్రక్రియ

## ఎన్నికల కోడ్ విధిగా పాటించాలి



నిజామాబాద్ బార్ అసోసియేషన్‌లో నూతన ఏపీపీలకు సన్మానం

నిజామాబాద్ లీగల్, అక్టోబర్ 21: నవంబర్ నెలలో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను ప్రతీ పౌరుడు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాటించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య కోరారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నికల చట్టం గురించి వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజు, చిదిరాల రాణి మాట్లాడుతూ ప్రజలు, రాజకీయ పార్టీలు తమ అవసరాల కోసం డబ్బులను చట్టపరిమితిలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు తనిఖీలు చేసే సమయంలో వారికి సహకరిస్తూ, చట్టానికి అనుకూలంగా వ్యవహరించాలన్నారు. నేటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు పోలీసులకు గురుతర బాధ్యతలు ఉన్నాయని, వాటిని గుర్తెరిగి మసలుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్,అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శేషు, డాక్టర్ పల్నాటి సమ్మయ్య, వీరయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**నూతన ఏపీపీలకు సన్మానం..**

గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టెన్యూర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్యాంరావు, బంటు, వసంత్, ఖాందేశ్ శ్రీనివాస్‌లను డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## ప్రిసైడింగ్ అధికారుల ర్యాండమైజేషన్ పూర్తి

కామారెడ్డి, అక్టోబర్ 21: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేశామని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రంలో జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలతోపాటు బాన్సువాడ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఏర్పాటు చేస్తున్న 913 పోలింగ్ కేంద్రాలకుగాను ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా శనివారం నిర్దేశించిన 2,405 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను మొదటి ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తున్నామని అన్నారు. నియోజకవర్గాలకు కేటాయించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనీల ద్వారా ఈ నెల 28, 30 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల నిర్వహణ, మాక్ పోలింగ్, ఓటింగ్ యంత్రాల్లో సాంకేతిక సమస్య తలెత్తితే నిబంధనలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు ఇలా ప్రతి అంశాన్నీ జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు.జిల్లాకు కేటాయించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించిన వాటిని క్లోజ్డ్ కంటైనర్‌ను పోలీసుల భద్రత మధ్య తరలించి అక్కడ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలోని ఈడీఎం గోదాములను అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

FOR LEASE/RENT
★కంఠేశ్వర్, బైపాస్ రోడ్ సమీపంలో రీమాడ్యురేషన్ న్యూ ఇండస్ట్రియల్ షెడ్డ్ (30X48) మరియు 600Sft స్టోర్ రూం, లీజుకు ఇవ్వబడును. 32HP కరెంటు సదుపాయం కలదు. సెల్: 94404 99958.
NTZ-308990

BUSINESS OFFER
★ప్రముఖ కంపెనీలో.. ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్‌గా నెలకు మీ పెట్టుబడిపై 10% డివిడెండ్, ప్రతిరోజు ఆదాయం, 24/7 any time బ్యాంక్ ద్వారా విత్ డ్రా. Free ట్రైనింగ్: 9392870811.
NT-318050-All

WANTED
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

PLOT FOR SALE
★Nizamabad, Near Water Tank, Laxmi Priya Nagar, Behind Vijay Public School 220 Sq.yds. Open Plot for Sale. Call: 9848891372, 9423451827, 8247454964.
NT-477

PLOT FOR SALE
★హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers. Ph: 9666912111, 7995005999.
NT-318030

PLOT FOR SALE
★Hyd., బాలానగర్ మండలం, ద్వారకామాయి ఆఫీసర్స్ కాలనీలో 300 Sq.yds. ఓపెన్ ప్లాట్ W/F (45'x60), పక్కా టైటిల్, LRS 6 నెలలు టైమ్, డైరెక్ట్ ఓనర్. Cont: 9441922102.
NT-081

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.